# అంతులేని కథ

ఇంద్రగంటి శ్రీనివాస శాస్త్రి

శ్రీమతి ఇచ్చిన కాఫీ గ్లాసు అందుకుని, న్యూస్ పేపరు చేతిలోకి తీసుకుని నడక కుర్చీలో కూర్చున్నాను.

పక్కింటి సుబ్బారావు గారి సుప్రభాత సూచనలు వినపడుతున్నాయి.

"సత్యా నా చెప్పు లెక్కడ?"

"అక్కడే ఉన్నాయండీ!"

"పెట్టిన చోట ఉంచటం అలవాటు లేదుగా. వెధవ సర్దుళ్ళూ మీరూను!"

"అబ్బ! నేను వచ్చి తీసిస్తా నుండండి."

"ఆ! చీర సింగారించేసరికి మాటు మణుగుతుందట. నువ్వు చెప్పులు తీసిచ్చేసరికి అక్కడ పాలు అయిపోతాయి. అన్నీ నేనే ఏడవాలి ఈ కొంపలో ..."

"ఏమిటి ఈ కాఫీ ఇలా తగలడింది? రుచీ లేదు, పచీ లేదు. పెళ్ళయి ఇన్నాళ్ళయింది కాఫీ పెట్టడం చేతకాదు."

"ఏమయిందండీ! బాగానే ఉందిగా. మీకు తీపి తక్కువయిందా?"

"నా శ్రాద్ధం తక్కువయింది. సరేలే! ఏం చేస్తాం?"

** ** **

నా శ్రీమతి తన చెవిని కిటికీ తలుపులకు ఆనించింది. "అబ్బ! రోజన్తమానూ ఆయన అలాగే సాధిస్తాడండి బాబూ! ఆమె ఆయనతో ఎలా కాపురం చేస్తోందో కాని!"

"నేను నీతో కాపురం చేయటం లేదూ?" అని మనసులో అనుకున్నాను.

** ** **

"సత్యా! ఆ నానిగాడు లేచాడా? అది కూడా నేనే చూసుకోవాలి. నువ్వు లేవవు. వాడు లేవడు. వెధవకి చదువూ లేదు, సంధ్యా లేదు. పగలంతా తిరుగుతాడు, రాత్రి నిద్ర. ఉదయం లేవడు. కర్మ కొద్దీ పిల్లలు!"

"ఒరే నానీ! లేవరా. ఏడయింది. స్కూలుకు వెళ్ళవూ?"

"అబ్బా! ఉండమ్మా! రాత్రి ఒంటి గంట దాకా టీ.వీ.లో సినిమా చూశాను కదా?"

"బాగుంది నాయనా! నువ్వు చెప్పిన మాట వినవు. ఆయన నన్ను తిట్టిపోస్తున్నారు. మీ రిద్దరూ బాగానే ఉంటారు మధ్య నే చస్తున్నాను."

** ** **

"ఈ రోజు ఏం వండుతున్నావ్?" అని శ్రీమతిని అడిగాను.

ఈ సంభాషణ ఇష్టం లేనిదానిలా "అబ్బా! ఉండండీ! ఎప్పుడూ తిండి రంధేనా? ఈ రోజు సెలవు పెట్టారు కదా? హొటల్‌కు పోదాం" అన్నది.

'ఏం వండుతున్నావు అని అడిగినందుకు పెద్ద శిక్షే పడింది' అనుకుని పేపరులో తలదూర్చాను.

** ** **

వేడి నీళ్ళు కాగిపోయి ఉంటాయి. తియ్యరాదూ? గ్యాసు వేస్టు చేస్తున్నారు."

"నీళ్ళు దించి, మళ్ళీ పడేశానండీ, నానిగాడికి."

"భోజనం పెట్టానండి, ఆఫీసుకు టైము అయిపోతోంది."

ఆఁ! వస్తున్నా. నా బెల్టు ఏదీ? పెన్ను ఏదీ?"

"అలమార్లో ఉన్నాయి కదండీ!"

"నీ ముఖమున్నాయి. ఒక్కటీ కనపడదు ఈ కొంపలో ఏం పనులో ఏమిటో!"

"అబ్బ వస్తున్నా నుండండి!"

"ఇవి ఏమిటండీ? సరిగ్గా వెతుక్కోలేరు. వెతికి ఇచ్చేదాకా ఆగరు. రోజూ ఇదే గొడవ మీతో."

"నోరు ముయ్యవేయ్! ఏదైనా పొరపాటు దొరుకుతుందా? సాధిద్దామని చూస్తూంటావ్!"

"ఇక్కడ మంచినీళ్ళు తగలడలేదు. ఏం భోజనం పెట్టటమో ఏమిటో! ఒక్కడికి భోజనం పెట్టటానికి ఇంత ఆర్భాటం చేస్తావు. మా అమ్మ తెల్లారితే పదిమందికి వండిపెట్టేది. ఏమిటి ఈ వేడి వేడి అన్నం ఎలా తిని చస్తాననుకున్నావ్? దానికి సాయం కూర కార మొకటి. ఈ పులుసు ఉడుకులు, మరుగులు. ఈ వెధవ భోజనం చేసే కన్నా అడుక్కు తినడం మేలు!"

"ఉదయం లేచినప్పటి నుంచి ఊరికే ఒక్కసారి కూర్చున్నాను టండీ! వంట పూర్తయేసరికి, మీకు ఆఫీసు టైము అయిపోయింది. చల్లారటానికి టైమేదీ? లేకపోతే చద్దన్నం తినాలి మరి!"

"ఆఁ! చెస్తున్నావు పేడ! ఇంతోటి వంటకి లేచినప్పటి నుంచీ సుణగ తిరుగుతున్నావ్. ఏదో పెద్ద పంచభక్ష్య పరమాన్నాలూ చేసినట్లుగా. బండ ఎద్దు అంటే ... పేడ రానుకున్నట్లుగా - చద్దన్నం తినాలట. ఆ భాగ్యానికి పెళ్ళెందుకు? ఈ లంపట మెందుకు? నేను హొటల్‌లో భోజనం చేస్తాను. నువ్వూ, నీ కొడుకూ తీరిగ్గా వండుకుని, హాయిగా మింగండి."

ఆఫీసుకు బయలుదేరిన మనిషి పదిసార్లు తలుపు తట్టాడు.

"సత్యా! నానిగాడిని త్వరగా తెమిల్చి స్కూలుకు పంపు."

"రేషనులో పంచదార తెచ్చుకో."

"నానిగాడి చెప్పులు తెగిపోయాయి. వీధిలో రిపేర్‌వాడు వస్తే కుట్టించు. లేదా బజార్లో నైనా సరే."

"గదిలో బల్బు మాడిపోయింది. తెచ్చుకో."

"అన్నట్లు నానిగాడికి స్కూలు ఫీజు కట్టాలి. ఈ రోజు లాస్టు డేట్ డబ్బు కట్టి రా!"


"ఆ వెధవను అడ్డగాడిదలా తిరగనీయకుండా కాసేపు పుస్తకాల దగ్గర కూర్చోబెట్టు. వెధవకు భయం, భక్తీ లేకుండా పోతున్నాయి. వాడి ఫ్రెండ్స్‌ని అస్తమానూ ఇంట్లోకి రానివ్వకు."

"అన్నట్లు కరెంటు బిల్లు కట్టాలి."

"మరిచిపోయాను. సాయంత్రం మా ఫ్రెండుని భోజనానికి రమ్మన్నాను. మంచి విందు ఏర్పాటు చెయ్యి."

"అబ్బ! ఈ కొంపలో అన్నీ నేనే జ్ఞాపకం చేయాలి. లేకపోతే ఒక్కటీ జరగదు. నేను లేకపోతే మీరు ఏమి చస్తారోగాని ... సరేలే! తలుపేసుకుని ఏడు. ఎవరైనా దొంగలు దూరగలరు. అసలే రోజులు బాగా లేవు."

** ** **



"ఆ మాటలు విన్న నా చెవులే చిల్లులు పడ్డట్టున్నాయి. మరి ఆ మహా ఇల్లాలు ఎలా భరిస్తోందో?" అన్నాను పొరబాటున. అంతే! బలి అయిపోయాను.

"మనం ఈ ఇంటికి వచ్చి ఇరవై రోజులయిందా? రోజూ ఇదే వరస! ఆవిడ కాబట్టి భరిస్తోంది. నేనైతే ఈ పాటికి పిచ్చాసుపత్రిలో ఉండేదాన్ని" అంటూ దండకం ప్రారంభించింది శ్రీమతి.

"నేను ఆయనలా లేకపోబట్టే కదా ఆవిడ బాధలు నేను పడవలసి వస్తోంది" అన్నాను ఎగతాళిగా.

"అసలు మీ మగవాళ్ళంత ఇంతే" అంటూ యుద్ధం ప్రకటించింది.



"ఆపాపు. ఎవరో వచ్చారు చూడు" అన్నాను మాట మారుస్తూ.

సాయంత్రం నాలుగు గంటలైంది. పక్కింటి సుబ్బారావు పూలతో ఇల్లు చేరాడు. తలుపు తెరిచింది శ్రీమతి సుబ్బారావు.

"ఏమిటి ఈ అవతారం? ఏడుపు ముఖం నువ్వూనూ! ఎంతో ఉత్సాహంగా ఇంటికి వచ్చేసరికి, నీ అవతారం చూస్తే నా ఉత్సాహమంత నీరుకారిపోతుంది."

"మీ కేం ఏమైనా చెపుతారు. చస్తున్నాను ఇంటా, బయటా పనులతో. ఏడుపు కాక మ రేం వస్తుంది?"

వద్దన్నా ఆ మాటలు నా చెవిన పడ్డాయి. ఏమిటి వాళ్ళ కాపురం? ఎప్పుడూ చిర్రుబుర్రులే! వీళ్ళకు ఆ నానిగాడు ఎలా పుట్టాడా అని అనుమానం వచ్చి నాలి క్కరుచుకున్నాను.

రాత్రి ఆ దంపతులు ఎలా ఉంటా రనే కుతూహలం, సంస్కారాల మధ్య చర్చ ప్రారంభమైంది. కుతూహలం సంస్కారాన్ని డామినేట్ చేసింది.

** ** **

"రవి వాళ్ళింటి కెళ్ళి ఇప్పుడే వస్తాను" అన్నాను శ్రీమతితో.

"చాల్లెండి సంబడం ఆ 'రవి' ఇంటికి వెళ్ళారంటే, ఆ పేకాటలో పడ్డారంటే ఈ రాత్రి శివరాత్రే" అన్నది శ్రీమతి.

నవ్వుకుంటూ బయటకు నడిచాను. శ్రీమతి భళ్ళున తలుపులు మూసుకుంది.

నేను చేయబోయే పని రైటా, తప్పా అని ఆలోచించుకుంటూ సుబ్బారావు బెడ్‌రూమ్ కిటికీ వెనగ్గా చేరాను. వాళ్ళకు నేను కనబడను. నాకు వాళ్ళు కనబడరు. కాని మాటలు వినవడుతున్నాయి.

"సత్య! ఏయ్! ఇటు."

"ఉఁ! ఉఁ! ఉహు! ఉహుఁ!"

"ఇటు తిరగరా సత్య!"

"నో! నో!"

"అబ్బా! అంత అలకా? అవును గాని, మన ఫస్ట్ నైట్ గుర్తుందా?"

"ఛీ! పొండి!"

"అప్పుడు నువ్వు ఎంత బుద్ధిగా ఉండేదానివో, ఎలా చెపితే అలా."

"అప్పుడు మీరు మాత్రం ఎంత ప్రేమగా చూసుకునేవారు! ముట్టుకుంటే కందిపోత నన్నట్లు, మాట్లాడితే బెదిరిపోత నేమో? అన్నట్లు చూసుకునేవారు."

"నువ్వు ఇలా మూతి ముడుపుతో నా మూడ్ పాడుచేయకోయ్!"

"అవును మీరు ఏడిపిస్తే ఏడవాలి. నవ్విస్తే నవ్వాలి అవునా?"

"అలిగితే కూడా ఎంత అందంగా ఉంటావో తెలుసా?"

"ఆ! తెలుస్తూనే ఉంది. మీ ముఖం చూస్తూంటే."

"అబ్బ! మాటల్ను నేర్చేశావేయ్!"

"ఏమి నేరిస్తే ఏం ప్రయోజనం? కడవంత గుమ్మడి కాయ కత్తిపీటకు లోకువట!"

"ఆ సామెత నేను చెప్పాలి డియర్! ఇటు తిరుగు నీకు ఒక మాట చెపుతను. ఏదీ చెవి ఇటు ఇయ్యి."

"ఛీ! పాడు! అసలు మీతో నేను మాట్లాడను!"

"అయ్యబాబోయ్! నీవు అంత స్ట్రైకు చేస్తే నేను చచ్చిపోనూ?"

"నేనే చచ్చిపోతను. మీరు సుఖంగా ఉండండి."

"ఛ! అలా అనకురా సత్య! నువ్వు అలా అంటే నేను ఏమైపోవాలి చెప్పు?"

"మీ కేం ఇం కో పెళ్ళి చేసుకుని సుఖంగా ఉంటారు."

"నీ మాటలతో నా గుండె కోసేయకోయ్! నిన్ను పెళ్ళి చేసుకున్న రోజున నీ మీద ఏ అభిప్రాయం ఉందో, ఇప్పుడూ అదే అభిప్రాయం ఉంది. ఆ రోజు ఎంత అందంగా కనపడ్డావో, ఇప్పుడూ, ఎప్పుడూ అలాగే కనిపిస్తావు. నిన్ను వదలి ఒక్క క్షణం కూడా ఉండలేను సత్య!"

"చాల్లెండి మీ మాయమాటలు! పగలల్లా చిరచిర లాడుతుంటారు సీమ మిరపకాయలా. చీకటి పడేసరికి ఎక్కడ లేని సరసం!"

"ఏమిటో అలా అలవాటు అయిపోయిందిరా!"

"ఆఁ! ఏ మలవాటు? రాత్రి ఇలాగా?"

"అది కాదు సత్య! నువ్వంటే నా కెంత ఇష్టమో తెలుసా? చచ్చేటంత ఇష్టం. ఏదో పిచ్చి కోపంలో నాకు తెలియకుండానే చికాకు పడతను కాని, ఆ తర్వాత ఆలోచించుకుని ఎంత బాధపడతానో తెలుసా? నువ్వు లేనిదే నాకు జీవితమే లేదు. నువ్వే నా జీవన జ్యోతివి. నీవు లేని నేను లేను. నువ్వు కాదంటే నేను ఇప్పుడే, ఇక్కడే చచ్చిపోతను. నీ మీద ఒట్టు, నా మీద ఒట్టు, మన నానిగాడి మీద ఒట్టు. దేముడి మీద ఒట్టు. ఇప్పటికైనా నా మాట నమ్ముతవా సత్య! వేయి జన్మలకైనా వీడు నీవాడే సత్య!"

గునగునలు ... నవ్వులు! లైట్స్ ఆఫ్.

'పగలు పులి, రాత్రి పిల్లి గురువుగారు' అనుకుంటూ ఇంటికి చేరి తలుపు తట్టాను.

శ్రీమతి తలుపు తెరిచింది.

అప్రయత్నంగా "పిల్లి ... పిల్లి" అన్నాను.

"అయ్యబాబోయ్ పిల్లి పాలు తాగేస్తుందేమో" అంటూ నా శ్రీమతి ఒక్క పరుగు తీసింది.

** ** **

"సత్య! పొంగిస్నీ డబ్బులూ ఎక్కడ తగలడ్డాయి!"

"ఆఁ వస్తున్నా నండీ!"

మళ్ళీ మొదలు! ★

● క్షణంలో పళ్ళరసాలు ● నిమిషాలలో మసాలాలు తయారుచేయగలది ● చాలా తేలికైనది



JOHNSON® జ్యూసర్ మిక్సర్ గ్రైండర్ —మీ వంటింటి విజేత

● శుభ్రంగా పండ్లరసాలు తయారు చేయవచ్చు. వెట్ అండ్ డ్రై గ్రైండింగ్.
● అదనపు పరికరాలు చేర్చుకునే వీలుతో ఒకే కేంద్రంగల యూనిట్
● ఆటో సేఫ్టీ కటాఫ్ ● శక్తివంతమైన 450 - వాట్ మోటర్
● ఒక సంవత్సరం గ్యారంటీ

BLUMAC Blumac Electricals India

Parade/BEI/8916

ఆంధ్రప్రదేశ్‌లో మార్కెట్ చేయువారు :

Mahavir Enterprises

5-9-1115, కాంచన జంగా కాంప్లెక్స్, కింగ్ కోటిరోడ్
హైదరాబాద్-500 001 ఫోన్ : 231198/231747